క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కె. కొత్తపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కె. కొత్తపాలెం గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు పాల్గొంటారని, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని వివరించారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు



గూడూరు: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు చేయకూడదంటూ కప్పలదొడ్డిలోని దుకాణాదారులకు సోమవారం నోటీసులు జారీ చేశారు. సర్పంచ్ యక్కల మాధవి మాట్లాడుతూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. ప్రభుత్వం ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధించినా కొన్ని చోట్ల దుకాణాదారులు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను వాటిని విక్రయించవద్దంటూ గ్రామంలోని దుకాణాధారులందరికీ నోటీసులు జారీ చేసినట్లు ఆమె వివరించారు.

చెడు మార్గాలను విడనాడాలి



నాగాయలంక: రక్షణ సైన్యం(సాల్వేషన్ ఆర్మీ) నాగాయలంక డీఓ ఆధ్వర్యంలో స్థానిక రాజేశ్వరి కాలనీలోని సంస్థ చర్చి ఆవరణలో సోమవారం యూత్ కౌన్సిల్–2023 సందర్భంగా యువతకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చెన్నై నుంచి వచ్చిన రక్షణసైన్యం ప్రతినిధి మేజర్ సీహెచ్ దేవదాసు మాట్లాడుతూ యువత చెడుమార్గాల్లో పయనించి జీవితాలను పాడు చేసుకోవద్దని హితవు పలికారు. సంస్థ డీఓ టి.ప్రసాదరావు మాట్లాడుతూ యువతీ యువకులు మొబైల్ ఫోన్ మోజులో పడి తప్పుదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

సుబ్బారాయుడికి వెండి వస్తువులు సమర్పణ

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి మంగళగిరికి చెందిన గీతికా బాంధవ్య కుటుంబ సభ్యులు రూ. 57 వేల విలువగల వెండి ప్లేట్, వెండి చెంబు సోమవారం సమర్పించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆమె స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 473 గ్రాముల వెండి ప్లేట్, 266 గ్రాముల వెండి చెంబు ఆలయ అధికారి వెంకట్రాద్రికి అందజేశారు. దర్శనం అనంతరం ఆలయ మర్యాదలతో దాత కుటుంబ సభ్యులను సత్కరించారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల శ్మశాన వాటికలో పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న వెంటనే సిబ్బందితో దాడిచేసి ఆరుగురు జూదరులను అరెస్ట్‌చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.1,590 నగదుని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ చెప్పారు. పేకాట, చిత్తులాట, ఇతర జూదాలు నిర్వహించినా, ఆడినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

జిల్లా ఆస్పత్రిలో స్వచ్ఛతాహీ సేవా



మచిలీపట్నంటౌన్: నగరంలోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో సోమవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్లు డి. ఆశాలత, చంద్రశేఖర్‌తో పాటు వైద్యులు, సిబ్బంది చీపురులు పట్టుకుని ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేశారు. ఆస్పత్రి క్యాజువాలిటీ, ఓపీ విభాగం, చిన్నపిల్లల విభాగం తదితర ప్రాంతాల్లో పరిసరాలు శుభ్రం చేశారు. అలాగే 46వ డివిజన్‌లో ఆ డివిజన్ కార్పొరేటర్ భోగాది సాయిబాబు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు.

బాధిత కుటుంబానికి సాయం

అవనిగడ్డ: మండల పరిధిలోని మోదుమూడిలో ఇటీవలె జరిగిన అగ్నిప్రమాదంలో కట్టుబట్టలతో మిగిలిన మేరుగు సీతామహాలక్ష్మికి శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ విలియం కేరీ, మేరుగ ప్రసాద్, బచ్చు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీబొమ్మ శివాలయం సెంటర్‌లో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, పేర్ని కిట్టు, సలార్‌దాదా



అవనిగడ్డలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, ఇతర నాయకులు



పెడన మంత్రి కార్యాలయంలో జరిగిన గాంధీజీ, లాల్‌బహదూర్‌ల జయంతి వేడుకల్లో నాగకుమారి, మల్లి తదితరులు

మహాత్మునికి మహా నివాళి

వాడవాడలా ఘనంగా గాంధీ జయంతి

మచిలీపట్నంటౌన్: భారత స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మాగాంధీ కీలకపాత్ర పోషించి దేశానికి స్వేచ్ఛావాయువులు అందించారని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. గాంధీ జయంతి కార్యక్రమాన్ని నగరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ శివాలయం సెంటర్, చిలకలపూడి పోలీస్‌స్టేషన్ సెంటర్‌లోని గాంధీజీ విగ్రహాలకు మేయర్ వెంకటేశ్వరమ్మతో పాటు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికులను మేయర్ ఘనంగా సత్కరించారు. డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా సర్వజన ఆసుపత్రిలో గాంధీజీ చిత్రపటానికి డెప్యూటీ సూపరింటెండెంట్లు బి. ఆశాలత, చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు నివాళులర్పించారు.
- బీజేపీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, నాయకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కోణి సెంటర్‌లోని కొల్లిపర సత్రం వద్ద గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు క్లబ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలు..

కోనేరుసెంటర్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో జాతిపిత మహాత్మగాంధీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చిట్టిపాలెంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జ్ చండిక అజయ్ మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పెదపట్నంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడిదేశి అనూష పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి బాలజీసు, గ్రామ ఇన్‌చార్జ్ గడిదేశి రాజు తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎన్ గొల్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మట్టా నాంచారయ్య పాల్గొని గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు.



మహాత్మగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బ్రహ్మచారి తదితరులు

మహాత్ముని మార్గం ఆదర్శనీయం..

కోనేరుసెంటర్: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గంలో విద్యార్థులు నడవాలని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బ్రహ్మచారి తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో సోమవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మచారి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థ జనరల్ మేనేజర్ జయంత్ సింఘ్ సిన్హా స్వచ్ఛదా సపద కార్యక్రమాన్ని నిర్వహించారు.

వాడవాడలా జాతిపితకు నివాళి..

కోడూరు: కోడూరు ప్రధాన సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, మండల కన్వీనర్ మాధవరావు, ఎంపీటీసీలు గంగాధరరావు, నాంచారయ్య పాల్గొన్నారు.

- కోడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ నాగరేవతి, ఏఓ ఆకుల పాండురంగారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు పాల్గొన్నారు.
- కోడూరు పంచాయతీలో సర్పంచి వెన్నా షైనీ, కార్యదర్శి యలవర్తి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి.
- పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్, పాలకాయతిప్ప మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ పవన్‌కిశోర్, ఎస్‌ఐ జిలానీ, రైటర్ రెహ్మాన్ జానీల పర్యవేక్షణలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.
- నరసింహాపురం రహదారిలోని గాంధీ విగ్రహం వద్ద వాసవీ కపుల్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో..

నాగాయలంక: నాగాయలంక ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక కన్యకాపరమేశ్వరీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో సంఘం అధ్యక్షుడు, ఆర్యవైశ్య రత్న చిట్టా సాంబశివరావు గాంధీజీ విగ్రహానికి, తాడికొండ సత్యనారాయణ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాగాయలంక పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేడుకలో మండల విస్తరణ అధికారి కె.అప్పల నరసమ్మ, సీనియర్ పారిశుధ్య కార్మికులు నివాళులు అర్పించారు.

గాంధీ మార్గం అనుసరణీయం..

చల్లపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని మహాత్మా గాంధీ స్మృతివనంలో గాంధీ విగ్రహానికి పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, గ్రామ సచివాలయాల సిబ్బంది నివాళులర్పించారు. చల్లపల్లి మోటారు మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మీర్ రిజ్వాన్ నివాళులర్పించారు.

జాతిపిత ఆశయాలు ఆదర్శనీయం..

పెడన: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కార్యాలయంలో గాంధీజీకి, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, పట్టణ కన్వీనర్ బండారు మల్లి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మహేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి, వైస్ చైర్మన్ ఎండీ ఖాజాలతో పాటు కౌన్సిలర్లు నివాళులర్పించారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లోని గాంధీజీ విగ్రహానికి, మున్సిపల్ పార్కులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు బొడ్డు వేణుగోపాలరావు, ఇతర నాయకులు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాజులపాటి వాణి, మాజీ ఎంపీపీ అచ్చుతరావు జాతిపిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవి క్షేత్రంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కాంప్లెక్స్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా గాంధీ జయంతి



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు గాంధీ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. మోపిదేవి గ్రామ సచివాలయంలో సర్పంచ్ నందిగం మేరీరాణి, నాగాయితిప్ప సచివాలయంలో సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావు, తహసీల్దార్ కార్యాలయంలో మోపిదేవి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద కోసూరు రామాంజనేయులు ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహాలకు పూలమాలలు వేసి. దేశానికి వారు చేసిన సేవలను కొనియాడారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరావు, నందిగం అభిషేకరావు తదితరులు పాల్గొన్నారు.



నాగాయలంకలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న చిట్టా, ఆర్యవైశ్య సంఘం నాయకులు

గాంధీ కలలు సాకారం దిశగా..

అవనిగడ్డ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి, ఫైర్‌స్టేషన్ వద్ద గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సీఎం జగన్ తన పాలన ద్వారా తీసుకొస్తున్నారన్నారు. సచివాలయాల ఏర్పాటు ద్వారా గ్రామాల్లోనే అన్ని సేవలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



చిట్టిపాలెంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ అజయ్



గాంధీ స్మృతి వనంలో..



రామానుజవత్తర్లపల్లిలో..

ఘనంగా గాంధీ జయంతి

గూడూరు: గూడూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లింగం సులోచన రాణి మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లవోలులో సర్పంచు బొర్రా సాంబశివయ్య గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కప్పలదొడ్డి గాంధీ యువజన సంఘం ఆధ్వర్యంలో బాపు జయంతి జరిగింది. రామానుజవత్తర్లపల్లిలో రాజులపాటి జమదగ్ని ఆధ్వర్యంలో మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి ప్రతిజ్ఞ నిర్వహించారు.



కోడూరు ప్రధాన సెంటర్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సచివాలయాలతో ప్రజల వద్దకే పాలన

ఎస్ఎన్ గొల్లపాలెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల వద్దకే పాలన సంకల్పంతో సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేశారని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు తెలిపారు. మండల పరిధిలోని ఎస్ఎన్ గొల్లపాలెంలో రూ. 35 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని సోమవారం కిట్టు రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ గతంలో ప్రజలకు ప్రభుత్వపరంగా ఎటువంటి పని అవ్వాలన్నా పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పరుగులు పెట్టాల్సివచ్చేదన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు అలాంటి ప్రయాసలకు గురికాకుండా ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన అందిస్తున్నారన్నారు. సచివాలయాల ద్వారా మారుమూల ఉన్న గ్రామీణ ప్రజలకు సైతం ఎటువంటి పని కావాలన్నా ఎక్కడికి వెళ్లకుండా తమతమ గ్రామాల్లోనే పని పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో బందరు నియోజకవర్గం కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, గ్రామ మాజీ సర్పంచ్ మట్టా మోహననాంచారయ్య, గణేశన వెంకటేశ్వరరావు, చోరగుడి రామచంద్రరావు, సీతారామపురం సర్పంచ్ మురారి నాగప్రమీల, బ్యాంకు అధ్యక్షుడు బెజవాడ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు

జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం

ఘనంగా సచివాలయ ఆవిర్భావ దినోత్సవం

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే గ్రామస్వరాజ్యం సాధ్యమైందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు)అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల నాల్గో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగనన్నకు వందనం కార్యక్రమాన్ని స్థానిక గాంధీబొమ్మ శివాలయం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహం సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ రాష్ట్రంలోని 1.30 లక్షల మందిని సచివాలయ శాశ్వత ఉద్యోగులుగా నియమించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని సేవలు అందిస్తూ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమను తగ్గించారన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టి ఏసురత్నం, జిల్లా అధ్యక్షుడు కోలా నాగబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజలకు సచివాలయాల ద్వారా సేవలు అందించే అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, కమిషనర్ జి. చంద్రయ్య పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పేర్ని కిట్టు, సచివాలయ ఉద్యోగులు

వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం

నాగాయలంక: స్థానిక ప్రసన్నగణపతి దేవస్థానం ఆధ్వర్యంలో 15 రోజులుగా జరుగుతున్న 66వ వార్షిక వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారి వసంతోత్సవ, నిమజ్జన మహోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించారు. తొలుత పందిరిలోని వేదికపై ఉత్సవ విగ్రహానికి ఆలయ అర్చకుడు అంబా సాయికిరణ్‌శర్మ బ్రహ్మత్వంలో సంప్రదాయక వసంతోత్సవ పూజలు జరిపి మేళతాళాలతో నిమజ్జన యాత్రకు తరలించారు. గణపతి బప్పామోరియా నినాదాలు, భక్తి పాటలు, డప్పు కళాకారుల విన్యాసాలు, తీన్‌మార్ డ్యాన్సులతో గణేశుని నిమజ్జనయాత్ర సాగింది. తొలుత కమిటీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, శ్రీరామపాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు ఉత్సవ విగ్రహానికి కొబ్బరికాయలు కొట్టి పూజలు జరిపారు. వినాయక విగ్రహాన్ని శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ నుంచి ప్రత్యేక పడవలపై కృష్ణానది మధ్యలోకి తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. వినాయకుని వసంతోత్సవం సందర్భంగా ఆనవాయితీ ప్రకారం నాగాయలంకలో అన్ని వ్యాపార సంస్థలు మూసేసి కార్యక్రమంలో పాల్గొన్నారు.



కృష్ణానదిలో నిమజ్జనం చేస్తున్న కమిటీ సభ్యులు

నేడు 'ఆరోగ్య సురక్ష' శిబిరాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లపరాజుగూడెం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బంటుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) వైద్యులు కె. పవన్‌కుమార్ తెలిపారు. సచివాలయ పరిధిలో నిర్వహించే ఈ శిబిరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేస్తారని, అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేస్తారని డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు.


పెడన పీహెచ్‌సీ పరిధిలో..

పెడన: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం నడుపూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పర్వేజ్‌హైదర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వలంటీర్లు, ఏఎన్ఎంలు ఇప్పటికే ఇంటింటికీ తిరిగి సర్వే చేసి టోకెన్లు అందజేశారని, టోకెన్లు పొందిన వారు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, ఉచితంగా అందించే మందులను పొందాల్సిందిగా సూచించారు.

నేటి నుంచి కోటి కుంకుమార్చన

మచిలీపట్నంటౌన్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బృందావనపుర ప్రార్థనా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ మంగళవారం నుంచి 23వ తేదీ సోమవారం వరకు నగరంలోని గీతామందిరంలో కోటి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 21 రోజుల పాటు భక్తులు వారి గోత్రనామాలతో కోటి కుంకుమార్చన చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు. అలాగే ఈ నెల 21, 22, 23 తేదీల్లో చండీ హోమం ఉంటుందన్నారు. ప్రతిరోజు సాయంత్రం శ్రీ లలితా సేవా మండలి వారిచే శ్రీ లలితా సహస్ర నామ పారాయణం చేస్తామన్నారు. అలాగే ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు గీతామందిరంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన టీడీపీ నాయకులు



చిలకలపూడి(మచిలీపట్నం): రాబోయే ఎన్నికల్లో జనసేన, తమ పార్టీ కలిసి పని చేస్తాయని టీడీపీ నాయకులు ప్రకటించారు. మచిలీపట్నంలోని సువర్ణ కల్యాణ మండపంలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను టీడీపీకి చెందిన కృష్ణాజిల్లా నాయకులు సోమవారం రాత్రి కలిశారు. పవన్‌కల్యాణ్‌తో మాట్లాడిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ప్రస్తుతం జైలులో ఉన్నారని ఆయన విడుదలైన అనంతరం మరోసారి పవన్‌కల్యాణ్‌తో కలిసి చర్చించిన అనంతరం కార్యాచరణ రూపొందిస్తామన్నారు. పవన్‌కల్యాణ్‌తో సమావేశమైన వారిలో కొనకళ్ల నారాయణరావు, కొల్లు రవీంద్ర, మండలి బుద్ధ ప్రసాద్, బూరగడ్డ వేదవ్యాస్, బోడె ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, రావి వెంకటేశ్వరరావు, కొనకళ్ల బుల్లయ్య, వర్ల కుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావు, కమ్మిలి విఠల్‌రావు, జనసేన పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ నాదెండ్ల మనోహర్, జనసేన పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నగరంలో కొనసాగిన పింఛన్ల పంపిణీ



36వ డివిజన్‌లో బొర్రా వెంకటేశ్వరరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్వప్న



పింఛన్ అందిస్తున్న వలంటీర్ శివపార్వతి

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో సోమవారం రెండో రోజు పింఛన్ల పంపిణీ కొనసాగింది. నగరంలో మొత్తం 19,123 పింఛన్లు ఉండగా 17,768 మందికి పింఛన్లను అందజేసి 92.1శాతం మేర పూర్తి చేశారు. ఇంకా 1,355 మందికి పింఛన్లు అందజేస్తే నూరుశాతం పంపిణీ పూర్తవుతుంది. పింఛన్ల పంపిణీలో సోమవారం మచిలీపట్నం నగరం జిల్లాలో 4వ స్థానం సాధించటం గమనార్హం.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ ఇచ్చిన వలంటీర్

చల్లపల్లి: వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు ఎక్కడ ఉన్నా గ్రామ వలంటీర్లు సకాలంలో నగదు అందిస్తున్నారు. చల్లపల్లి గ్రామ సచివాలయం–3కి చెందిన ఒంటరి మహిళ పింఛన్ లబ్ధిదారు, జగనన్న కాలనీకి చెందిన మేకా ధనలక్ష్మి ఇటీవల ప్రమాదవశాత్తూ కింద పడటంతో మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని అక్కడే కోలుకుంటోంది. ఆమె బ్లాక్ గ్రామ వలంటీర్ దేవిశెట్టి శివపార్వతి సోమవారం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి చేరుకుని పింఛన్ సొమ్ము రూ.2,750ను అందజేసింది.

చౌహాన్ సింగ్ సేవలు అమూల్యం



చల్లపల్లి: చౌహాన్ సింగ్ మరణం హోమియో వైద్య రంగానికి తీరని లోటు అని ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ నేతి ప్రభాకరరావు అన్నారు. సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి సభ్యుడు, హైదరాబాద్ జేఎస్‌పీఎస్ హోమియో కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, హోమియో వైద్య పరిశోధకులు బెల్లపు చౌహాన్ సింగ్ సంస్మరణ సభ సోమవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రం హోమియో సెంటర్‌లో నిర్వహించారు. చౌహాన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాలను ఒప్పించి గ్రామీణ ప్రాంతాల్లోనూ చౌహాన్ సింగ్ హోమియో ఆస్పత్రులు ఏర్పాటు చేయించారని తెలిపారు. చల్లపల్లిలో సీఆర్ వికాస కేంద్రంలో ఈ హోమియో సెంటర్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించి, అనునిత్యం తనవంతు సహకారం అందించారని తెలిపారు. కార్యక్రమంలో హోమియో వైద్య నిపుణురాలు డాక్టర్ ఎన్‌వీఏ దివ్యరాశి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, వికాస కేంద్రం ఇన్‌చార్జి మేకా నరసింహారావు పాల్గొన్నారు.